క్లుప్తంగా

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

తిరుపతి అర్బన్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి సరైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌తో కలసి ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, అవసరం మేరకు వీడియోగ్రఫీ, మైక్రో అబ్జర్వర్ ఏర్పాటుతో, తగినంత కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీస్ ఏర్పాట్లు చేపడుతామని వెల్లడించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే నాలుగు కంపెనీల కేంద్ర బలగాలు జిల్లాకు చేరుకున్నాయని, మరిన్ని బలగాలు జిల్లాకు రానున్నాయని తెలిపారు.

బీఈడీ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు మంగళవారం విడదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి దామ్లా నాయక్ మంగళవారం తెలిపారు. ఫలితాలను ఆన్‌లైన్‌లో విడుదల చేశామని, ఫలితాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

యామినికి డాక్టరేట్ ప్రదానం



తిరుపతి సిటీ: ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ విభాగం పరిశోధక విద్యార్థిని ఓ యామినికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆమె అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జీవీ రమేష్‌బాబు పర్యవేక్షణలో డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఏ నావెల్ ఫీచర్ ప్రాబబిలిటీ బేస్డ్ డెసిషన్ ట్రీ ఆల్గరిథం విత్ అప్లికేషన్ అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు.

రైల్వే స్టేషన్‌లో చలివేంద్రం



ప్రయాణికులకు తాగునీటిని అందిస్తున్న స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ

తిరుపతి(అలిపిరి): మండుటెండల్లో ప్రయాణికులకు ఊరటనిచ్చేందుకు తిరుపతి రైల్వే భద్రతా దళం ఆధ్వర్యంలో మంగళవారం రైల్వే స్టేషన్‌లో స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు స్టేషన్ మేనేజర్ చెన్నప్పరెడ్డి, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ హేమసుందర్ రావు ప్రయాణికులకు చల్లటి తాగునీటిని పంపిణీ చేశారు.

ఘాట్ రోడ్డులో ప్రమాదం

తిరుమల: మొదటి ఘాట్ రోడ్డులో ఆగి ఉన్న కారును ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన ఆరుగురు భక్తులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు చేరుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం కారులో మొదటి ఘాట్ రోడ్డు మీదుగా తిరుమల నుంచి తిరుపతికి బయల్దేరారు. వీరి వాహనం వినాయక విగ్రహం వద్ద మరమ్మతు కావడంతో రోడ్డుకు పక్కగా నిలిపివేశారు. ఇదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు కారును బలంగా ఢీకొంది. కారు వెనుక భాగం, బస్సు ముందు భాగం ధ్వంసమయ్యాయి. కారులోని భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

ప్రచార స్టిక్కర్స్ ఆవిష్కరణ

తిరుపతి కల్చరల్: ఎన్నికల ప్రచారం నిమిత్తం వైఎస్ఆర్ సీపీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన ప్రచార స్టిక్కర్స్‌ను మంగళవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారపు మధు, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి చెంద్రాయుడు, బీసీ సెల్ కార్యదర్శి నాగేంద్ర, మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషా, మైనారిటీ నేత సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచార స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

హలో.. కామ్రేడ్స్



వామపక్ష కూటమి నాయకులను పలకరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: తిరుపతి 13వ డివిజన్ ఎస్టీవీ నగర్‌లో మంగళవారం కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కే బాబు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎదురుపడ్డ వామపక్ష కూటమి నాయకులను హలో కామ్రేడ్స్ అంటూ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి వారిని ఆత్మీయంగా పలకరించారు. వామపక్ష కూటమి నాయకులు మురళి, తులసేంద్ర, కేతారి రాధాకృష్ణ, జనార్ధన్‌లను ఆత్మీయంగా పలకరించి ఆలింగనం చేసుకున్నారు.

అభినయ్‌ని ఆశీర్వదించండి



తిరుపతి 42వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ శేఖర్‌రెడ్డి



తిరుపతి 27వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న మేయర్ శిరీష



తిరుపతి 14వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి మంగళం: వైఎస్ఆర్ సీపీ తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా నగరంలోని 50 డివిజన్లలో కార్పొరేటర్లు, అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ అభినయ్‌కి ఓట్లు వేసి ఆశీర్వదించాలని కోరుతున్నారు. అందులో భాగంగా మంగళవారం తిరుపతి 27వ డివిజన్‌లో కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, 14వ డివిజన్‌లో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, 42వ డివిజన్‌లో కార్పొరేటర్ శేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి, గిరిధర్‌రెడ్డి, 9వ డివిజన్‌లో మహ్మద్‌కాసీమ్(చోటాబాయ్), ఆదం సుధాకర్ రెడ్డి, ప్రసాద్, 44వ డివిజన్‌లో కార్పొరేటర్ వరికుంట్ల నారాయణ, పోలిరెడ్డి నాగిరెడ్డి, అశోక్‌రెడ్డి, నాధముని, యోగాంజనేయులు ఇంటింటా జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగనన్న అందించిన సంక్షేమ పథకాలు, తిరుపతిలో అభినయ్‌రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని స్థానిక ప్రజలను అభ్యర్థించారు.



తిరుపతి 9వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆదం సుధాకర్‌రెడ్డి, మహ్మద్‌కాసీమ్



తిరుపతి 44వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ నారాయణ, పోలిరెడ్డి నాగిరెడ్డి

చిన్నారులను చిదిమేస్తున్నారు





అభం శుభం ఎరుగని చిన్నారులను జనసేన, టీడీపీలు ప్రచారంలో పావులుగా వాడుకుంటున్నాయి. చదువుకునే వయసులో వారిని వీధులపాలు చేస్తున్నారు. తిరుపతిలో మంగళవారం టీడీపీ, జనసేన చేపట్టిన ప్రచారంలో బాలలు జెండాలు పట్టి వీధుల్లో తిరుగుతూ కనిపించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

బుడబుక్కల కూటమికి ఎల్లో మీడియా భజన

తిరుపతి కల్చరల్: బాబుకూటమిని అందలమెక్కించేందుకు ఎల్లో మీడియా బరితెగింపు రాతలకు పాల్పడడం సిగ్గుచేటని వైఎస్ఆర్ సీపీ నాయకుడు బొమ్మగుంట రవి ధ్వజమెత్తారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయనపై తప్పుడు రాతలు రాసిన ఎల్లో మీడియా పత్రికను చూపుతూ మండిపడ్డారు. తాను వైఎస్ఆర్ వీరాభిమానినని, కరుణాకరరెడ్డి శిష్యుడుగా, వైఎస్ఆర్ సీపీ విధేయుడినని స్పష్టం చేశారు. అయితే పచ్చ కామెర్లు కప్పిన ఎల్లో పత్రిక చంద్రబాబుకు వత్తాసు పాడుతూ బలహీనవర్గాలను టార్గెట్ చేసి పచ్చి అబద్దాలను చిత్రీకరించడం దుర్మార్గమన్నారు. మూడు జెండాలతో బుడబుక్కల వారిలా వీధుల్లో తిరిగే కూటమి అభ్యర్థుల మాటలను ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. పెత్తందారీల అధికారం కోసం బలహీనులపై తప్పుడు రాతలు రాయడాన్ని ఎల్లో మీడియా మానుకుంటే మంచిదన్నారు. లేకుంటే రజకుడైన తాను వంద గాడిదలతో ఎల్లో మీడియా కార్యాలయం ముందు బట్టలుతికి కుట్రలు బట్టబయలు చేస్తానని హెచ్చరించారు. కట్టా గోపియాదవ్, కృష్ణమూర్తి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.



తనపై తప్పుడు రాతలు రాసిన ఎల్లో మీడియా పత్రికను చూపుతున్న బొమ్మగుంట రవి

ఆర్థిక సాయం

తిరుపతి కల్చరల్: వృత్తిరీత్యా అనారోగ్యానికి గురై చేతి నరాలు దెబ్బతిని టూ వీలర్ ఎలక్ట్రికల్ మెకానిక్ రమేష్‌కు అవసరమైన ఆపరేషన్ కోసం తిరుపతి టూ వీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించి చేయూతనిచ్చారు. వైద్య ఖర్చులకు అవసమరయ్యే సొమ్మును కూడా అసోసియేషన్ ద్వారా సాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఆర్థిక సాయం అందించిన వారిలో అసోసియేషన్ కార్యదర్శి జలంధర్, ఉపాధ్యక్షుడు ప్రభు, సహాయ కార్యదర్శి గురునాథాచారి, కమిటి ఇన్‌చార్జ్ సోమనాథ్, రూరల్ ఇన్‌చార్జ్ గురునాథ్, కాలేషా, శివ, సుదర్శన్, వెంకీ, పాపయ్య, విక్కీ ఉన్నారు.

ముస్లింల ద్రోహి చంద్రబాబు

– వైఎస్ఆర్ సీపీ మైనారిటీ రాష్ట్ర అధ్యక్షుడు విక్టరీ ఖాదర్‌బాషా



మాట్లాడుతున్న విక్టరీ ఖాదర్‌బాషా

తిరుపతి కల్చరల్: అధికారం కోసం రోజుకొక పొత్తుతో పోటీ చేస్తూ మోసపూరిత మాటలతో ఊసరవెల్లి రాజకీయాలు చేసే అవకాశవాది నారా చంద్రబాబునాయుడని, ముస్లింలను నమ్మించి నట్టేట ముంచిన నమ్మక ద్రోహి అని వైఎస్ఆర్ సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు విక్టరీ ఖాదర్‌బాషా తీవ్ర స్థాయిలో విమర్శించారు. మంగళవారం షాదీమహల్ సమావేశ మందిరంలో ఆయన ముస్లిం మేధావులతో చర్చా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన గత టీడీపీ పాలనలో ముస్లింలకు జరిగిన అన్యాయాన్ని, ప్రస్తుత వైఎస్ఆర్ సీపీ పాలనలో జరిగిన మేలును గురించి తెలియజేశారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వంతో సంసారం చేస్తూ బాబు ప్యాకేజీలు తెచ్చుకున్నారు తప్ప ప్రజల సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి ఏమీ చేయలేదని తెలిపారు. గత ఐదేళ్లలో వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం రూ.21 వేల కోట్లు మైనారిటీల సంక్షేమానికి ఖర్చు చేసిందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. మళ్లీ అధికారం కోసం చంద్రబాబు కూటమితో జతకట్టి బూటకపు హామీలు ఇస్తున్నారని, దీనిని ముస్లింలు గుర్తించి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. జనరంజక పాలనతో సంక్షేమ సారథిగా ప్రజల హృదయాలను గెలిచినా తాను సంక్షేమం చేసి ఉంటేనే ఓటు వేయండి అని ప్రచారంలో అభ్యర్థిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. మనసున్న మైనారిటీలు వైఎస్ జగన్ గెలుపులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జోనల్ కో ఆర్డినేటర్ సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్.ఖాదర్‌బాషా, మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి చాంద్‌బాషా, జిల్లా అధ్యక్షుడు గఫూర్, వివిధ మసీదుల ముత్తవల్లీలు, ఇమామ్‌లు, మత పెద్దలు పాల్గొన్నారు.

పార్టీ మారిన ఆరణి సజ్జనుడు ఎలా అయ్యాడు

తిరుపతి కల్చరల్: చిత్తూరు ఎమ్మెల్యేగా ఆరణి శ్రీనివాసులు అక్రమాలను కథనాలుగా మలచి ఎల్లో మీడియా ప్రచురించలేదా అని వైఎస్ఆర్ సీపీ యువజన విభాగం నేతలు ప్రశ్నించారు. అంతేకాక రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాన మోదీ పోలవరాన్ని ఏటీఎంగా మార్చుకుని చంద్రబాబు దండుకున్నారని విమర్శించింది వాస్తం కాదా అన్నారు. వీటిపై బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి, టీడీపీ నేతలు సమాధానం చెప్పాలని వైఎస్ఆర్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆరే.అజయ్‌కుమార్, పసుపులేటి సురేష్ ప్రెస్‌క్లబ్ వేదికగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా గతంలో ఆరణి అక్రమాల కథనాల క్లిప్పింగ్‌లను ప్రదర్శించి, ఆరణి దుర్మార్గాలను, కూటమి నేతల రాజకీయ కుట్రలను బహిర్గతం చేశారు. అధికారం కోసం కూటమి మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టి లబ్ధిపొందే ప్రయత్నాలకు దిగడం దుర్మార్గమన్నారు. వంచించే చంద్రబాబు, ప్యాకేజీ కోసం బరితెగించే పవన్ కల్యాణ్, అభివృద్ధిపై అవినీతి అంటూ మోకాలొడ్డే బీజేపీ నేతలకు రానున్న ఎన్నికల్లో ఓటుతో ప్రజా గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో నేతలు కార్తీక్, రాజ్‌కుమార్, నాగేంద్ర, రాంబాబు పాల్గొన్నారు.



ఎల్లోమీడియా కథనాలను మీడియాకు చూపుతున్న వైఎస్ఆర్ సీపీ యువజన విభాగం నేతలు

నగదు తిరిగి అప్పగింత

తిరుపతి క్రైమ్: రేణిగుంటలో నివాసముంటున్న ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో డబ్బులు పోగొట్టుకోగా తిరిగి వారికి సైబర్ క్రైమ్ పోలీసులు అప్పగించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీస్ పీఆర్‌ఓ విభాగం విడుదల చేసిన ప్రకటన వివరాలిలా ఉన్నాయి. రేణిగుంటకు చెందిన గుణశేఖర్‌కు సోమవారం సైబర్ నేరగాళ్ల నుండి లింకు వచ్చింది. ఆ లింకును ఓపెన్ చేసిన వెంటనే అతని ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డులోని రూ. 38,500 డెబిట్ అయింది. వెంటనే అప్రమత్తమై సైబర్ పోలీసులను ఆశ్రయించారు. వారు సరికొత్త టెక్నాలజీతో గంటల వ్యవధిలోనే బాధితుడికి రిఫండ్ అయ్యేలా చేశారు.

కేంద్ర బలగాల ఫ్లాగ్ మార్చ్

తిరుపతి క్రైమ్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగరంలో పలు ప్రాంతాల్లో మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్జీఓ కాలనీ, హరే రామ హరే కృష్ణ ఆలయం, ఖాదీ కాలనీ, అలిపిరి ప్రాంతాలలో కేంద్ర సాయుధ బలగాలతోపాటు అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సంయుక్తంగా నిర్వహించారు. ప్రజలంతా నిర్భయంగా ఓటు వేయాలని, ప్రజల్లో భయాందోళనలు తొలగించేందుకే ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

వేడుకగా మహా చండీహోమం

తిరుపతి కల్చరల్: పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మంగళవారం మహా చండీహోమం అత్యంత వేడుకగా నిర్వహించారు. పూర్ణాహుతితో మహా చండీహోమం పరిసమాప్తమైంది. ఆలయ ఈవో కె.మమత, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రైవేటు పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు

విశ్వం స్కూల్ విద్యార్థుల వంద శాతం ఉత్తీర్ణత



అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో విశ్వం విద్యాసంస్థల ప్రతినిధులు

తిరుపతి ఎడ్యుకేషన్: పదో తరగతి ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం స్కూల్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి విజయ కేతనం ఎగురవేశారని ఆ విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థులు రెడ్డి చరణ్ రెడ్డి, యశ్వంత్, అఖిలేష్, మధుప్రియ, చైతన్య, కొమల్ కుమార్, శశాంక్ రెడ్డి, శివకృష్ణ గణితంలో వందకు వంద మార్కులను సాధించారని పేర్కొన్నారు. ఇంతటి ఘన విజయానికి కృషిచేసిన విద్యార్థులకు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు , సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు విశ్వం స్కూల్ యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

క్యాంపస్ స్కూల్‌లో ఉత్తమ ఫలితాలు



ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందిస్తున్న వీసీ శ్రీకాంత్ రెడ్డి, రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్

ఎస్వీయూకి అనుబంధంగా నడుస్తున్న క్యాంపస్ స్కూల్ విద్యార్థులు పది ఫలితాలలో కార్పొరేట్ స్కూల్స్‌కు మించి ఉత్తీర్ణత సాధించారు. సోమవారం విడుదల చేసిన ఫలితాలలో 96.2 శాతం ఉత్తీర్ణత సాధించి, పాఠశాల కీర్తిని మరోసారి చాటారు. 2023–24 విద్యా సంవత్సరంలో 80మంది పరీక్షలు రాయగా 66మంది మొదటి శ్రేణిలోనూ, ఆరుగురు ద్వితీయ శ్రేణిలోనూ, ఐదుగురు తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఎం.జీవన అనే విద్యార్థిని 574 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలవగా, 21 మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం వీసీ వి.శ్రీకాంత్‌రెడ్డి, రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు షకీనను, ఉపాధ్యాయులను, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

సెవెన్‌హిల్స్ విద్యార్థుల ప్రతిభ



జె.నిత్యపద్మసాయి, వి.దివ్యదర్శిని

పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో సెవెన్‌హిల్స్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ మార్కులతో ప్రతిభ చాటారు. ఈ ఫలితాల్లో జె.నిత్య పద్మసాయి 590, వి.దివ్యదర్శిని 587, డి.యువశ్రీ 584 మార్కులు సాధించారు. వీరితోపాటు 580కిపైగా మార్కులు నలుగురు, 550కిపైగా 19మంది, 500కుపైగా 37మంది విద్యార్థులు మార్కులు సాధించారు. వీరిని ఆ పాఠశాల కరస్పాండెంట్ ఎం.హరనాథశర్మ, హెచ్ఎం ఎం.హేమలత అభినందించారు.

ప్రతిభ చాటిన శ్రీవిద్యానికేతన్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో సత్యనారాయణపురంలోని శ్రీ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి ప్రతిభ చాటారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆ పాఠశాల కరస్పాండెంట్ జి.నీరజా శ్రీనివాస్ అభినందించారు.

సత్తా చాటిన నలంద



విద్యార్థులతో ఓబుల వెంకటరమణారెడ్డి తదితరులు

పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో నలంద పాఠశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. ఈ ఫలితాల్లో ఎం.రకీబా 579, వి.భరతసింహారెడ్డి 578, ఐ.మోక్షిత 572మార్కులు సాధించారు. వీరితో పాటు 25మందికి పైగా విద్యార్థులు 500కుపైగా మార్కులు సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఓబుల వెంకటరమణారెడ్డి, డైరెక్టర్ ఓబుల ఆనందరెడ్డి తెలిపారు.

సీఎస్ తేజ విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న రవి

పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో మంగళంలోని సీఎస్ తేజ పాఠశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించి ప్రతిభ చాటారు. ఈ ఫలితాల్లో సి.పోషిత 583మార్కులు సాధించిందని, అలాగే 18మంది విద్యార్థులు 500కుపైగా మార్కులు సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ టి.రవి తెలిపారు.

పది ఫలితాల్లో స్ప్రింగ్‌డేల్ విద్యార్థుల విజయ దుందుభి



టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల ప్రతినిధులు

ప్రభుత్వ విద్యాశాఖ విడుదల చేసిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కరకంబాడి రోడ్డులోని స్ప్రింగ్‌డేల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో విజయ దుందుభి మోగించినట్లు పాఠశాల అధినేత కేఎస్ వాసు తెలిపారు. పరీక్షకు హాజరైన 82 మంది పాసై వంద శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమన్నారు. కె.చరిత-594 మార్కులు సాధించినట్లు తెలిపారు. అలాగే ఆర్ పార్థు-591 మార్కులు, బి.యశ్వంత్-590 మార్కులు సాధించారని పేర్కొన్నారు. అలాగే 580కిపైగా 13 మంది, 550కిపైన 41 మంది, అత్యున్నత మార్కులు సాధించారని తెలిపారు. 65 మంది విద్యార్థులు 500లకుపైగా మార్కులను పొందారన్నారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించిన వారిలో ఆయనతో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ కేఆర్ అనురాధ గోపాల్, హెచ్ఎం ప్రమీల కృష్ణన్, ఏవో చంద్రశేఖర్, పీఆర్వో సాంబశివారెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.



క్లుప్తంగా

కల్యాణ వెంకన్న గరుడ సేవ



గరుడ వాహనంపై గోవిందుడు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు మంగళవారం రాత్రి గరుడ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామున స్వామివారిని సుప్రభాత సేవలో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. తదుపరి స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి, మరకత మాణిక్యాలు, వజ్రవైఢూర్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామివారికి ఊంజల్ సేవ కనుల పండువగా నిర్వహించారు. అనంతరం గోవిందుడు తనకు ప్రీతిపాత్రమైన గరుడునిపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చక స్వామి బాలాజీ రంగాచార్యులు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రాములవారి కల్యాణోత్సవం



విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీకోదండరామ స్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను ఆలయ ఆవరణలోని కల్యాణ మండపానికి వేంచేపు చేశారు. తదుపరి స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

ఆంగ్ల భాషతో ఉపాధి మెండు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేంద్ర

పాకాల: ఆధునిక కాలంలో ఆంగ్ల భాష నేర్చుకోవడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి అవకాశాలు పొందవచ్చని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేంద్ర అన్నారు. మంగళవారం కళాశాలలో ఆంగ్ల విభాగంలో ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆంగ్లభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆంగ్ల అధ్యాపకుడు డాక్టర్ ఎస్.వి.రమేశ్‌కుమార్ విలియం షేక్‌స్పియర్ జీవితం, రచనల విశిష్టత, ఆంగ్లభాష ప్రాముఖ్యత వివరించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మాసిలామణి, మోహన్‌బెహరా, మాధవి, ఈశ్వరబాబు, రమణమ్మ, చిట్టి కళావతి, ఆదిశేఖర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వేడుకగా మహా చండీహోమం

తిరుపతి కల్చరల్: పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మంగళవారం మహా చండీహోమం అత్యంత వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గంగజాతర నెల మంగళవారం కావడంతో అమ్మవారిని మొక్కజొన్నలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. బంగారు ముఖబింబం, బంగారు వజ్ర కిరీటంతో కొలువుదీర్చి భక్తులకు దర్శన భాగ్యం కలిప్పించారు. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమ వేదికపైకి అమ్మవారి ఉత్సవమూర్తిని వేంచేపు చేసి మహా చండీహోమం చేపట్టారు. పూర్ణాహుతితో మహా చండీహోమం పరిసమాప్తమైంది. ఆలయ ఈవో కె.మమత, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



మహా చండీహోమంలో భాగంగా పూర్ణాహుతి

నామినేషన్ పండుగకు మేమంతా సిద్ధం అంటూ నినదిస్తున్న పార్టీ నాయకులు



మోహిత్‌రెడ్డి నామినేషన్‌కు సర్వం సిద్ధం

- 50 వేల మంది కార్యకర్తలతో భారీ ర్యాలీ
- మేమంతా సిద్ధం అంటూ ప్రతి కార్యకర్త కదలిరావాలి
- చంద్రగిరి నేతలతో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సమావేశం

చంద్రగిరి: చంద్రగిరి కోటపై మరోసారి వైఎస్ఆర్ సీపీ జెండా ఎగురవేసేలా.. చంద్రగిరి పురవీధులు జన సంద్రమయ్యేలా నాయకులు, కార్యకర్తలు, జగనన్న అభిమానులు వేలాదిగా తరలి రావాలని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం చంద్రగిరి వైఎస్ఎంఆర్ కల్యాణ మండపంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు చంద్రగిరి నాగాలమ్మ కూడలి వద్ద ప్రత్యేక పూజలు చేసిన తర్వాత నామినేషన్ దాఖలుకు బయలుదేరుతారని తెలిపారు. ఈ మేరకు పెద్ద ఎత్తున నిర్వహించే భారీ ర్యాలీకి ప్రతి ఒక్కరూ హాజరై ఒక ఉప్పెనలా కదలాలని సూచించారు. 2014, 2019 ఎన్నికల సమయ నామినేషన్ దాఖలు చేసిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి అందించిన మద్దతు అన్నయ్య మోహిత్‌రెడ్డికి కూడా ఇవ్వాలని కోరారు. నాగాలమ్మకు పూజలు చేసిన తర్వాత ర్యాలీగా బయల్దేరి తొండవాడ సమీపంలోని ఉగ్రప్రత్యంగిరాదేవి ఆలయం వరకు జన ప్రవాహం మధ్య వెళ్తారని, ఆ తర్వాత తిరుపతి ఆర్డీఓ కార్యాలయానికి నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. తొలుత చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని చెప్పారు. ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు మేము సైతం సిద్ధం అంటూ నియోజకవర్గంలోని నలుమూలల నుంచి తరలిరావాలని కోరారు. చంద్రగిరి మండలం నుంచి భారీగా జనం తరలేలా నాయకులు చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. ఐదేళ్లుగా ప్రతి కార్యకర్తను తమ కుటుంబ సభ్యునిగా అనుకున్నామని, ప్రస్తుతం ప్రతి కార్యకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఓ కుటుంబ సభ్యుడిగా భావించి తరలి రావాలని అభ్యర్థించారు. చంద్రగిరి పట్టణం జన సంద్రాన్ని తలపించాలన్నారు.

10 కుటుంబాలు వైఎస్ఆర్ సీపీలో చేరిక

చంద్రగిరి పట్టణం ఇందిరమ్మ కాలనీలో 10 కుటుంబాలు వైఎస్ఆర్ సీపీలో చేరి, టీడీపీకి షాక్ ఇచ్చారు. చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి వీరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించి, పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. ఇందిరమ్మ కాలనీకి చెందిన భాగ్యలక్ష్మి, లక్ష్మమ్మ, మంజుల, విజయలక్ష్మి, హేమలత పార్టీలో చేరారు. ఇందిరమ్మ కాలనీ ఇన్‌చార్జ్, ఎంపీటీసీ సభ్యుడు బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, మహిళా నాయకురాలు లతారెడ్డి ఆధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరి తమ మద్దతు తెలిపారు.





మాట్లాడుతున్న యువనాయకుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, ఇందిరమ్మ కాలనీకి చెందిన టీడీపీ మహిళలను వైఎస్ఆర్ సీపీలోకి ఆహ్వానిస్తున్న హర్షిత్‌రెడ్డి

పేదల సంక్షేమానికి జగనన్న పెద్దపీట



భాకరాపేటలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్సీ యండపల్లి, చెవిరెడ్డి లక్ష్మి



భాకరాపేట ప్రచారంలో మోహిత్‌ను ఆశీర్వదించాలని కోరుతున్న చెవిరెడ్డి లక్ష్మి

భాకరాపేట: రాష్ట్రంలో జగనన్న పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారని మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. మంగళవారం భాకరాపేట గ్రామ పంచాయతీలో మీ ఇంటికి మీ మోహిత్ కార్యక్రమం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి చేపట్టింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యండపల్లి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత చేపట్టిన సంక్షేమ పథకాలు ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేపట్టలేక పోయిందన్నారు. ఇక్కడ సంక్షేమ పథకాలు గురించి అంతలా ఎందుకు చెప్పాల్సి వస్తుందంటే జగనన్న ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలు నేరుగా అర్హులకు చేరడంతోపాటు, ప్రజల నిత్యావసరాలకు తోడ్పాటు అందించాయన్నారు. తద్వారా అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడ్డాయన్నారు. ప్రజల శ్రేయస్సుకు అధిక ప్రాధాన్యం ఇచ్చిన ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం... ఆ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే పేదల జీవితాలు మరింత మెరుగ్గా మారుతాయన్నారు. చంద్రగిరి నియోజకవర్గం మరింత అభివృద్ధి జరగాలంటే ఎమ్మెల్యేగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. అలాగే చెవిరెడ్డి లక్ష్మి మాట్లాడుతూ ఫ్యాను గుర్తుకు ఓటు వేయడం ద్వారా మంచి పాలనకు పట్టం కట్టినట్లు అవుతుందన్నారు. మోహిత్‌రెడ్డి మీకు అండగా ఉంటాడు... అందుబాటులో ఉంటాడు... మంచి కోరుకునే తమ బిడ్డను మీ బిడ్డగా ఆశీర్వదించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి పనులను వివరిస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి, జడ్పీటీసీ స్వరూప, మండల అధ్యక్షుడు కొండారెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు గురుశంకర్, స్థానిక సర్పంచ్ సాకిరి భూపాల్, సైదుల రమణ, హరి, సుబ్రమణ్యం, నాగప్ప, ఉప సర్పంచ్ ఉమామహేశ్వరి, మహిళా మండలి అధ్యక్షురాలు రజినీ, కళావతి, సావిత్రి, ఆకుల మణి, మత్తుంశెట్టి మధు, పురుషోత్తం తదితరలు పాల్గొన్నారు.

క్యాంపస్ స్కూల్‌లో ఉత్తమ ఫలితాలు



ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందిస్తున్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి, రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్

తిరుపతి సిటీ: ఎస్వీయూకి అనుబంధంగా నడుస్తున్న క్యాంపస్ స్కూల్ విద్యార్థులు పది ఫలితాలలో కార్పొరేట్ స్కూల్స్‌కు మించి ఉత్తీర్ణత సాధించారు. సోమవారం విడుదల చేసిన ఫలితాలలో 96.2 శాతం ఉత్తీర్ణత సాధించి, పాఠశాల కీర్తిని మరోసారి చాటారు. 2023–24 విద్యా సంవత్సరంలో 80మంది పరీక్షలు రాయగా 66మంది మొదటి శ్రేణిలోనూ, ఆరుగురు ద్వితీయ శ్రేణిలోనూ, ఐదుగురు తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఎం.జీవన అనే విద్యార్థిని 574 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలవగా, 21 మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం వీసీ వి.శ్రీకాంత్‌రెడ్డి, రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు షకీనను, ఉపాధ్యాయులను, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా ఆశీర్వదించండి



గంగుడుపల్లిలో మోహిత్‌రెడ్డి గెలుపు కోసం ప్రచారం చేస్తున్న చెవిరెడ్డి మంజుల

- గంగుడుపల్లిలో చెవిరెడ్డి మంజుల విజ్ఞప్తి

చంద్రగిరి: ఎమ్మెల్యేగా మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించి, గెలిపించాలని, ఆపత్కాలంలో ఆదుకునే మనస్సు కలిగిన నాయకుడిగా ఎదుగుతూ మంచి పనులు చేస్తాడని చెవిరెడ్డి చెవిరెడ్డి మంజుల తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గంగుడుపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన చెవిరెడ్డి మంజులకు మహిళలు పెద్ద ఎత్తున మద్దతు పలికారు. ఇంటింటా హారతులు పట్టి స్వాగతం పలికారు. మహిళలందరూ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని చంద్రగిరి నుంచి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. అంతకుముందు మంజుల మాట్లాడుతూ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. తండ్రికి తగ్గ తనయుడిగా జనం ముందుకు వచ్చిన మోహిత్‌రెడ్డి కోసం ప్రతి ఒక్కరూ మే నెల 13వ తేదీ జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్ఫూర్తితో, చెవిరెడ్డి మార్గంలో నడిచి ప్రతి ఇంటికి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి న్యాయం చేస్తారని ఆమె వెల్లడించారు.

ప్రజలే కుటుంబంగా భావించే వ్యక్తి ఎమ్మెల్యే చెవిరెడ్డి

నియోజకవర్గంలోని ప్రజలందరూ తన కుటుంబ సభ్యులుగా భావించే వ్యక్తి చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అని మంజుల అన్నారు. పండుగలైనా, విపత్తులైన, ఆపత్కాలమైన అన్ని వేళలా ప్రజల్లో ఉంటూ ప్రజల కోసం పరితపిస్తూ ఈ పదేళ్లు ఆయన పని చేశారని గుర్తు చేశారు. ఆయన తనయుడు మోహిత్‌రెడ్డి అతి చిన్న వయస్సులో తండ్రి బాటలో నడుస్తూ ప్రజాసేవ కోసం కంకణబద్ధుడై పని చేస్తున్నాన్నారు. ఆయన్ను ఎమ్మెల్యేగా గెలిపించుకుని హ్యాట్రిక్ సాధిద్దామని, ఆ విజయాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇద్దామని ఆమె పిలుపునిచ్చారు.



ఘనంగా పొన్నకాల్వ ఉత్సవం



స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం

చంద్రగిరి(తిరుచానూరు): చిత్రాపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ గోవిందరాజస్వామివారి పొన్నకాల్వ ఉత్సవం మంగళవారం వైభవంగా సాగింది. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు ఆలయం నుండి శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి, ఆండాల్ అమ్మవారు, శ్రీకృష్ణస్వామి, విష్వక్సేనులవారు తొమ్మిది మంది దేవేరులతో ఊరేగింపుగా తనపల్లి రోడ్డులోని పొన్నకాల్వ మండపానికి ఊరేగింపుగా చేరుకున్నారు. అనంతరం అక్కడ ఉదయం 9 నుండి 11 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు శ్రీగోవిందరాజ స్వామివారు అక్కడి నుండి బయలుదేరి తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. గోవిందరాజ స్వామివారు వచ్చే సమయంలో అమ్మవారి ఆలయంలో ఒక తలుపు మూసి ఉంచుతారు. బావగారైన గోవిందరాజస్వామివారు వచ్చారని పద్మావతి అమ్మవారు లోపలి నుండి ఆసక్తిగా తొంగి చూస్తారని, అందుకే ఆలయంలో ఒక తలుపు మూసి ఉంచుతారని పురాణాల ద్వారా తెలుస్తోంది. అక్కడ పూజాధికాలు ముగించుకుని గోవిందరాజ స్వామివారు ఊరేగింపుగా తిరిగి ఆలయానికి బయలుదేరారు. రాత్రి 8 గంటలకు తిరిగి శ్రీగోవిందరాజస్వామి ఆలయానికి చేరుకోవడంతో పొన్నకాల్వ ఉత్సవం ముగిసింది. ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు నారాయణ, మోహన్ రావు, ఇతర అధికారులు, ఆలయ అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల ఫ్లాగ్ మార్చ్

తిరుపతి క్రైమ్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగరంలో పలు ప్రాంతాల్లో మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్జీఓ కాలనీ, హరే రామ హరే కృష్ణ ఆలయం, ఖాదీ కాలనీ, అలిపిరి ప్రాంతాలలో కేంద్ర సాయుధ బలగాలతోపాటు అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సంయుక్తంగా నిర్వహించారు. ప్రజలంతా నిర్భయంగా ఓటు వేయాలని, ప్రజల్లో భయాందోళనలు తొలగించేందుకే ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

అమ్మవారి సేవలో రావత్



ఆలయంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రావత్

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్, మరికొంత మంది ప్రముఖులు మంగళవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి, అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో వారు పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సీ రామాపురంలో చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

రామచంద్రాపురం: మండలంలోని సీరామాపురం సమీపంలోని బ్రేవ్లీ హిల్స్ విల్లా సముదాయంలోని ఫ్లాట్ నంబర్ 69లో మంగళవారం చోరీ జరిగింది. 470 గ్రాముల బంగారం చోరీకి గురైనట్లు ఇంటి యజమాని రాబర్ట్ సందీప్ ఫిర్యాదు అందిన వెంటనే చంద్రగిరి డీఎస్పీ శరత్‌రాజ్ కుమార్, సీఐ రామయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం వేలిముద్రలు సేకరించింది. స్థానిక ఎస్సై చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫోర్జరీ కేసులో నిందితుడికి రెండేళ్లు జైలు

తిరుపతి కల్చరల్: జనన ధ్రువీకరణ పత్రాన్ని ఫోర్జరీ చేసి పాస్‌పోర్టు ఆఫీసు సిబ్బందిని మోసం చేయడానికి ప్రయత్నించిన కేసులో ప్రకాశం జిల్లాకు చెందిన ప్రస్తుత తిరుపతి యశోదనగర్‌కు చెందిన వై.వెంకటేశ్వర్లుకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.... పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ఆదేశించిన మేరకు పోలీసులు విచారణ జరిపి నకిలీ జనన ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించినట్లు నిర్ధారించారు. దీనిపై జిల్లా స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ ఎం.శ్రీనివాసమూర్తి అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి వెంకటేశ్వర్లుతోపాటు అతనికి సహకరించిన నలుగురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం వెంకటేశ్వర్లుపై మాత్రం రుజువు కావడంతో న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. మిగిలిన ముగ్గురిపై కేసును కొట్టివేశారు. ఐదో నిందితుడు గతంలోనే మరణించాడు.



